క్లుప్తంగా

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



కాకుమాను: ప్రస్తుతం గ్రామాలలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మండల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు అభివృద్ధి పనులపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రతి అధికారి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు తియ్యగూర వెంకటరెడ్డి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ



రేటూరు(కాకుమాను): ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని రేటూరు, అప్పాపురం రైతు భరోసా కేంద్రాల వద్ద గురువారం 50 శాతం సబ్సిడీపై రైతులకు జనుము, జీలగ, పిల్లి పెసర, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తమయ్యే రైతులు పచ్చిరొట్ట విత్తనాలను తమ పంట పొలాల్లో జల్లడం వలన భూసారం పెరిగి అధిక పంట దిగుబడులు సాధించవచ్చునని ఆమె సూచించారు. ప్రతి రైతు పచ్చిరొట్ట విత్తనాలు తీసుకువెళ్లాలని తెలిపారు. పలువురు రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

582 మందికి బీసీజీ టీకా

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం క్షయవ్యాధి నిరోధక బీసీజీ టీకాను 582 మందికి వేసినట్లు నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు ఫరీనా బేగం, ఎస్తేరు రాణి తెలిపారు. 60 ఏళ్లు పైబడిన, బరువు తక్కువగా ఉన్నవారు, షుగర్ రోగులు, గతంలో క్షయ బాధితులై మందులు వాడుతున్న వారికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు. టీకాలు వేసేందుకు వీలుగా ముందుగానే ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి టీకా ప్రయోజనాలను తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, పీహెచ్‌ఎన్ గాయత్రీ దేవి, ఎంపీహెచ్‌ఎస్ అబ్దుల్ రెహమాన్, కె.సుదర్శన్ రాజు, హెచ్‌వీలు నూర్ ఖాజాబీ, అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అనుసరించాలి

ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లకు సూచనలు

పొన్నూరు: జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాల ప్రక్రియలో పాల్గొనే కౌంటింగ్ ఏజెంట్లు జూన్ 1న ఫారం–18 రెండు సెట్లు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను అందజేయాలని ఆర్వో లక్ష్మీకుమారి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్వో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుళ్లు, పార్లమెంట్ కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 3 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియమించిన కౌంటింగ్ ఏజెంట్‌ను మార్చుకోదలచిన వారు ఫారం–19 ద్వారా దాఖలు చేసుకోవాలన్నారు. ఈ మార్పు కౌంటింగ్ ప్రక్రియ ముందురోజే చేసుకోవాలని సూచించారు. 4న ఉదయం 6.30 నిమిషాలకే లెక్కింపు కేంద్రమైన 204 రూమ్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు. ఎవరూ మొబైల్ ఫోన్లను ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకురాకూడదని అన్నారు. కౌంటింగ్ హాల్‌లో పూర్తి క్రమశిక్షణతో మెలుగుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియను నడపగలిగిన వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా ప్రతిపాదించాలని అభ్యర్థులను కోరారు. నిబంధనల మేరకు కౌంటింగ్ ప్రక్రియకు సహకరించని ఏజెంట్లను బయటకు పంపించడం జరుగుతుందని, వారి స్థానంలో వేరొకరిని నియమించడం జరుగుతుందని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు బాణాసంచా కాల్చటం నిషేధించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఆర్వోలు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో లక్ష్మీకుమారి

చలపతి ఫార్మసీలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్(ఏపీసీఏ), శ్రీ ఆనంద్ చెస్ వింగ్ (ఎస్‌ఏసీడబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి చెస్ ఓపెన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టోర్నమెంట్‌ను జూన్ 2న లాం నందున్న తమ కళాశాల ఆవరణలో నిర్వహించటం సంతోషకరమన్నారు. మొత్తం 8 రౌండ్స్‌గా ఈ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. విజేతలకు రూ.1.10 లక్షల నగదు బహుమతులను అదే రోజున అందజేస్తారన్నారు. ఈ టోర్నమెంట్‌ను 7, 9, 11, 13, 15 ఏళ్ల వయస్సు గల బాల బాలికలకు నిర్వహిస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేయటం జరుగుతుందన్నారు. జనరల్ కేటగిరిలో మొదటి 20 మంది విజేతలకు నగదు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. బెస్ట్ వెటరన్, బెస్ట్ ఉమెన్, బెస్ట్ గుంటూరు, బెస్ట్ పీహెచ్ ప్లేయర్లకు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు రూ.1000లు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు క్రీడాకారులు ఎం. గోపినాథ్‌ను 9703049378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పీఈటీలు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న డాక్టర్ రామారావు, అసోసియేషన్ సభ్యులు

ఏపీ ఎన్నికల అధికారి తీరు ఏకపక్షం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీడీ.భగవాన్



పట్నంబజారు: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషన్‌లు, కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలు ఒకే రకంగా ఉంటే ఏపీ సీఈఓ మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్ ఆరోపించారు. నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ప్రత్యేక రూల్స్ పెట్టి వాటిని ఏపీ సీఈఓ ఆదేశించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎన్నికల కమిషన్ తొలి నుంచి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, పోస్టల్ బ్యాలెట్ అంశంలో ఇది బట్టబయలైందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఏపీ సీఈఓ వ్యవహరించడం సరికాదని ఖండించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరు చూస్తుంటే స్పష్టంగా కూటమికి మద్దతు తెలియజేస్తుందనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాల వల్ల పూర్తి స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న తీరును కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కేంద్ర ఎన్నికల అధికారులు, రాష్ట్రంలో జరుగుతున్న ఏకపక్ష నిర్ణయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఇనుము దొంగిలిస్తున్న నలుగురి అరెస్టు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్ల వద్ద ఇనుము దొంగిలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు తుళ్ళూరు సీఐ షేక్ సుభానీ తెలిపారు. వివరాల మేరకు.. గురువారం ఉదయం ఐఏఎస్ క్వార్టర్ల నుంచి ఇనుము దొంగిలిస్తున్నారన్న సమాచారం మేరకు వీఆర్వో సహకారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఆటోల్లో 270 ఇనుప చువ్వలను లోడ్ చేసి తరలిస్తుండటాన్ని గమనించి, స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఎనిమిదిన్నర క్వింటాళ్ల ఉన్న వీటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.50 వేలు ఉండవచ్చని, వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రసన్నాంజనేయునికి నాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకొని త్రైయాహ్నిక ఉత్సవం గురువారం నిర్వహించారు. వేద పండితులు పవన్ కుమార్, సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మండపారాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, కళశ స్థాపన పూజలు చేసి గణపతి, హనుమత్ యాగాలు నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు ప్రసన్న మూర్తి, రాజగోపాలభట్టర్, వినయ్‌కుమార్, నిఖిల్ భరద్వాజ్ పూజలు చేశారు.

పుట్ట హుండీ ఆదాయం రూ.73 వేలు



పొన్నూరు: మండలంలోని కట్టెంపూడి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానం(పుట్ట)కు సంబంధించిన రెండు హుండీలను గురువారం లెక్కించగా రూ.73 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ మేనేజరు ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఎండోమెంట్ బాపట్ల ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో 85 రోజులకు సంబంధించి కానుకల రూపంలో వచ్చిన నగదును లెక్కించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ వి.శివనాగేంద్రమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రేత అరెస్టు

తాడికొండ: తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 36 క్వార్టర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ షేక్ సుభానీ తెలిపారు. వివరాల మేరకు.. ఐనవోలు గ్రామానికి చెందిన రామిశెట్టి రవి అనే వ్యక్తి అదే గ్రామంలోని చెరువు వద్ద మద్యం విక్రయిస్తుండగా..పట్టుకున్నట్లు తెలిపారు. మెక్ డోనాల్డ్ విస్కీ 15 క్వార్టర్లు, మ్యాన్షన్ హౌస్ బ్రాందీ 21 క్వార్టర్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.6,270 ఉంటుందని వివరించారు. విక్రేతను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుభానీ తెలిపారు.

ఇసుక ట్రాక్టరు,ప్రొక్లెయిన్ సీజ్

తాడికొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు, ప్రొక్లెయిన్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు సీఐ షేక్ సుభానీ తెలిపారు. వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో ఇసుకను అక్రమంగా లోడ్ చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ–2 అనురాధ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఒక ట్రాక్టరుతో పాటు ప్రొక్లెయినర్‌ను అదుపులోకి తీసుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నరసింహ శతకానికి విశిష్ట స్థానం



ప్రసంగిస్తున్న సుందర రామకృష్ణ

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం నరసింహ శతకకర్త శేషప్ప కవి పద్య గానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ నరసింహ శతకంలో పద్యాల్ని రాగ యుక్తంగా గానం చేసి, అందులోని భావాల్ని తెలియజేశారు. అన్ని శతకాలలో నరసింహ శతకానికి విశిష్టత ఉందన్నారు. పద్యాల్లో శ్రీమహావిష్ణువును సంబోధించడంలో మృదుత్వం, కాఠిన్యం, బెదిరింపు, కోపం చూపి శేషప్ప తన భక్తి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారని వివరించారు. ఆయన పద్య గానం ఆహూతుల్ని అలరించింది.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు బహుమతుల ప్రదానం

మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్, ఉమెన్ బెంచ్ ప్రెస్–2024 పోటీలు గురువారం రెండవ రోజు ఉత్సాహంగా జరిగాయి. మహిళల విభాగంలో పలువురు తమ ప్రతిభను కనపరచి బహుమతులు సాధించారు. విజేతలకు వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయ భాస్కరావు, షేక్ సంధాని, సకల కోటేశ్వరరావు, ఎస్‌సీ మోహన్, మద్దె ప్రభాకర్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్, వీజే కళాశాల కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం, దుస్తుల పంపిణీ

తెనాలి: స్థానిక అమరావతి కాలనీలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పౌష్టికాహారం, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ క్రీడా దుస్తులను అందజేసింది. స్టేడియంలో గురువారం సాయంత్రం ఏర్పాటైన సమావేశంలో స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నడుస్తున్న హ్యాండ్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 20 మంది క్రీడాకారులకు వీటిని అందజేశారు. క్రీడాకారులు చక్కని శిక్షణ పొంది జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్ రాజ్ కొఠారి, గుత్తా వెంకటరత్నం, ఆలపాటి కిరణ్, బత్తుల వెంకటేశ్వరరావు, కోచ్ నాగరాజు, వినయ్‌కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కళ్లం విద్యార్థుల ప్రతిభ

కళాశాలలో జాబ్ అచివర్స్ డే వేడుకలు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యతతో కూడిన విద్యను అందించటంతో పాటు ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్ ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల జాబ్ అచీవర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో డిప్లొమా డిగ్రీ పూర్తి చేసుకున్న మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 48 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సూర్యటెక్ సొల్యూషన్స్, లాగిస్కిం సొల్యూషన్స్ వంటి సంస్థల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించటం సంతోషకరమన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు



శారదా పీఠ పరిపాలిత దేవస్థానంలో ఆంజనేయ స్వామి



ఏటుకూరు రోడ్డులోని ఆలయంలో హోమం నిర్వహణ

నగరంపాలెం: పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విష్వక్సేన ఆరాధన, రక్షాబంధనం ఋుత్విక్వరణం, గణపతి హోమం, లక్ష్మీ నారాయణ హోమం, నవగ్రహ హోమం, వేద పండితుల మంత్రాలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు జరిపారు. భక్తుల రాకతో దేవాలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కాసుల వెంకటశివప్రసాద్, గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం తొండెపు రవి దంపతుల్ని పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

ఏటుకూరు రోడ్డులోని శ్రీ సువర్చలా సమేత అభయాన్జనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్ని పాలక మండలి ఆధ్వర్యంలో రాజకుమార్‌శర్మ అర్చకత్వంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం నిత్య పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో భూవారాహి హోమం (భూ సంభందిత సమస్యలకు) పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం కార్త వీర్యార్జున హోమం (రుణ సంభందిత సమస్యలకు) నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు గుంటూరు నగర, శివార్లల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉత్సవ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, చల్లని మజ్జిగను అందించారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీ షీట్లు తెరుస్తాం

యర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో కార్డన్ సెర్చ్

మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు జూన్ 4న ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని రూరల్ సీఐ వెంకటరావు హెచ్చరించారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో గురువారం సీఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, స్థానికేతరులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ర్యాలీలు, సంబరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్‌ఐలు క్రాంతి కిరణ్, కిషోర్, మహేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

‘పొగ’చూరుతున్న బతుకులు

31న నో టుబాకో డే

- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ.200 వరకు జరిమానా
- పొగాకు వినియోగంతో అనేక నష్టాలు



జీజీహెచ్‌లో పొగాకు అలవాటు మాన్పించే కేంద్రం

గుంటూరు మెడికల్ : యవ్వనంలో ఫ్యాషన్ కోసమో... సరదా కోసమో చేసే ధూమపానం చివరకు ప్రాణాలకు ముప్పుతెస్తోంది. సిగిరెట్, బీడీ, చుట్ట తాగే అలవాటు వ్యసనంలా మారి మనిషిని తనకు బానిసను చేసుకుంటుంది. స్మోకింగ్, పొగాకు ఉత్పత్తుల మోజులో పడి యువత, భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటుంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో 40 శాతం మంది పొగ తాగటం, పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారానే వ్యాధుల బారిన పడి మరణిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ధూమపానంతో కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా మే 31న నో టుబాకో డేను నిర్వహిస్తున్నారు.

జిల్లాలో బాధితులు అధికమే...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 35 శాతం మంది యువత స్మోకింగ్‌కు ఎఫెక్ట్ అయ్యారు. జిల్లాలో వివిధ రోగాలతో 30 నుంచి 39 ఏళ్ల వయస్సు వారిలో చనిపోతున్న ప్రతి ఐదుగిరిలో ఒకరు పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన చనిపోతున్నవారే. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతినెలా 1,200 మంది పురుషులు, రెండు వేల మంది మహిళలు వివిధ రకాల క్యాన్సర్లతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 శాతం మంది కేవలం పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన క్యాన్సర్ బారిన పడ్డారు. జిల్లాలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించేందుకు 15 ఆస్పత్రులు, క్లీనిక్‌లు ఉన్నాయి. వీటిల్లో ప్రతిరోజూ 400 మంది వరకు క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు.

చట్టం ఏం చెబుతుందటే..

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం రైల్వే స్టేషన్‌లు, సినిమాహాల్స్, బస్ స్టేషన్‌లు, జనసంచారం ఉండే మార్కెట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదు. ముఖ్యంగా పాఠశాలలు, గుడులకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మటం చట్టరీత్యా నేరం. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు చట్టరీత్యా అమ్మకూడదు. వారిచేత విక్రయించరాదు. చట్టాన్ని అతిక్రమించిన వారికి రూ.200 వరకు జరిమానా విధిస్తారు. ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మాత్రమే స్మోకింగ్ చేసేందుకు అనుమతించాలి.

జీజీహెచ్‌లో ఉచిత కౌన్సెలింగ్

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని విడనాదాలనుకునేవారికి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి మందులు అందిస్తున్నారు. 2019 నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లో పొగాకు వినియోగం అలవాటును మాన్పించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది 1,069 మందికి చికిత్స అందించడం ద్వారా కొంత మంది స్మోకింగ్ అలవాటును విడనాడారు. స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఛాతి ముందు భాగంలో, భుజానికి, తొడకు ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని ప్రాంతంలో నికోటిన్ ట్రాన్స్‌ధర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. ఈ ప్యాచ్ అంటించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా ప్రతినెలా పది మందికి పైగా పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ తెలిపారు.

క్యాన్సర్‌కు ఆధునిక వైద్యసేవలు...



క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే వారిలో 40 శాతం మంది పొగాకు, దాని ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నవారే. పొగతాగటం, పొగాకు ఉత్పత్తులు ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ లాంటి వాటిని వినియోగించటం వల్ల నోరు,గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉండటం ద్వారా త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆకాంలజిస్ట్, గుంటూరు

ధూమపానంతో గుండెజబ్బులు



పొగ తాగేవారిలో రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొగాకులో 400 రకాల విష పదార్థాలు ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ వలన గుండెపోటు, టార్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. నపుంసకత్వం, పక్షవాతం పొగరాయుళ్లను వదలవు. పొగ తాగే వారికి చుట్టుపక్కల ఉన్నవారిపై కూడా పొగాకు ప్రభావం ఉంటుంది. గుండె జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చేవారిలో 70 శాతం మంది పొగప్రియులే.

– డాక్టర్ డాక్టర్ బాపిరెడ్డి నారాయణరెడ్డి, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు